క్లుప్తంగా

రేపు అఖండ హరినామసప్తాహం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామంలో శ్రీరామాలయం వార్షికోత్సవం సందర్భంగా అఖండ హరినామ సప్తాహం కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు వార్‌కరి భజన మండలి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం కీర్తనలు, హరి జాగరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సప్తాహంలో భాగంగా 28వ తేదీ మంగళవారం గాథపూజ, 29న బుధవారం కాలకీర్తన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి పూర్తి వేతనాలు పొందాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మండల పరిధిలోని నాగుర్(కే) గ్రామ శివారులో సోమవారం చేపట్టిన ఉపాధిహామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవులుతో కలిసి పరిశీలించారు. రెండున్నర మీటర్ల పొడువుతో ఒక మీటరు వెడల్పు, అర మీటరు ఎత్తుతో కట్టలు నిర్మాణం చేస్తే ఒక్కొక్కరికి రూ.300 కూలి చెల్లించనున్నట్లు తెలిపారు. నాగుర్(కే)లో 150 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ ప్రదీప్ తెలిపారు.

నేడు ఎరువుల పంపిణీ

జోగిపేట(అందోల్): ఆందోల్ మండల పరిధిలోని రైతులకు వానాకాలానికి సంబంధించి మంగళవారం నుంచి జనుము, జీలుగ ఎరువులను సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి విజయరత్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువులైన 30కేజీల జీలుగా బ్యాగును రూ.2790 సబ్సిడీ రూపంలో రూ.1116, 40 కేజీల జనుము రూ.3620 కాగా సబ్సిడీ రూపంలో రూ.1448కు ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఈ నెల 21వ తేదీన పంపిణీ చేసే ఎరువులు ఏఆర్ఎస్‌కే-1 రైతుసేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారుల తీరుపై ఆర్డీఓకు ఫిర్యాదు

నారాయణఖేడ్: నిజాంపేట మండల తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది తరచూ అందుబాటులో ఉండటంలేదని మండల కేంద్రానికి చెందిన ప్రభాకర్ సోమవారం ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోతుండటం, ఉన్న సమయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కుల, ఆదాయ ధృవపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వాపోయాడు. ఆయా ధృవపత్రాల కోసం తాను గత రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నాడు. అధికారులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరాడు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

నారాయణఖేడ్: మండల పరిధిలోని తుర్కపల్లి శివారులో ఉన్న భూలక్ష్మమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న జాతరకు హాజరైన భక్తులకు సోమవారం శివశక్తి సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ హిందూ బంధువులందరూ భగవద్గీతను పఠిస్తూ సన్మార్గంలో నడువాలని సూచించారు.
20 ఎన్ఆర్‌కె 03: భగవద్గీతలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

నర్సరీ పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని భీంరా గ్రామంలోని నర్సరీని ఎంపీడీఓ సత్తయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జామ, కానుగతో పాటు ఇతర మొక్కలు 100 శాతం మొలకెత్తడం, ఏపుగా పెరగడంతో పంచాయతీ సెక్రటరీ మహేందర్, సిబ్బందిని అభినందించారు. వానలు కురిసే సమయానికి మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచాలని పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. కార్యక్రమంలో కారోబార్ మారుతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనిపిస్తే కబ్జా

విలువైన భూములపై అక్రమార్కుల కన్ను

- ప్రభుత్వ, శిఖం, హుడా భూములే ప్రధాన టార్గెట్
- నామమాత్రపు కూల్చివేతలకే అధికారులు పరిమితం
- క్రిమినల్ కేసులు నమోదు చేసినా ప్రయోజనం శూన్యం
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

జిన్నారం మండలం.. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడలు అవుటర్ రింగురోడ్డుకు సమీపంలో ఉంటాయి. దీంతో ఇక్కడి భూములకు రూ.కోట్లల్లో విలువ ఉంది. ఈ ప్రాంతాల్లో విల్లాలు, భారీ అపార్టుమెంట్లు వెలిశాయి. అదేవిధంగా ఇంటర్నేషనల్ స్కూళ్లతో పాటు అన్ని వసతులు ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ, శిఖం, హుడా భూములను యథేచ్ఛగా అక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్, హుడా శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)



ఇటీవల బొల్లారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు (ఫైల్)

బొల్లారం మున్సిపాలిటీతో పాటు ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో ఉన్న విలువైన భూములకు రెక్కలొచ్చాయి. ఏళ్ల కాలం నుంచి భూఆక్రమణలు జరుతున్నా కబ్జాలను నివారించటంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికలు ఆరోపిస్తున్నారు. ఖాజీపల్లిలోని 181 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో తరచూ భూ ఆక్రమణలను చేపడుతున్నారు.

24 చెరువులకు 14 కబ్జా

శిఖం భూములు ఇప్పటికే భారీగా కబ్జాలకు గురయ్యాయి. బొల్లారం మున్సిపల్ పరిధిలో 24 చెరువులు, కుంటలు ఉండగా ప్రస్తుతం 10 మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగతావి ఎప్పుడో కబ్జాలకు గురయ్యాయి. ఈ విషయం ఇరిగేషన్‌శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కబ్జాల విషయంపై ఇటీవల స్థానిక నాయకులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు కబ్జాలకు గురైన భూములను పరిశీలించి వెళ్లారు. కానీ.. ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. హుడా పరిధిలోని భూములను కూడా అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారు. బీసీ కాలనీలో ఉన్న హుడా భూముల్లో ఇటీవల చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఈ విధంగా తరచూ ప్రభుత్వ, శిఖం భూములు కబ్జాలకు గురవుతున్నాయి. భూముల రక్షణకు అధికారులు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

ఎప్పటికప్పుడు కూల్చివేస్తున్నాం

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదు. ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తూనే ఉన్నాం. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని సైతం ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూములను అక్రమించాలని చూస్తే క్రిమినల్ కేసులు తప్పవు. భూకబ్జాలు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం.

– భిక్షపతి, తహసీల్దార్, జిన్నారం

కఠిన చర్యలు తప్పవు

బొల్లారం, ఖాజీపల్లి తదితర ప్రాంతాల పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇందుకోసం తగిన బందోబస్తును తమ పరిధిలోని భూముల వద్ద ఏర్పాటు చేశాం. కబ్జాలు చేసిన వారి వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సహకరించాలి.

– వెంకటేశం, హుడా సీఐ

రైతులను ఆదుకోవాలి

- ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించొద్దు
- ఆర్డీఓ పాండుకు సీపీఎం నాయకుల వినతి



ఆర్డీఓ పాండుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు రైతులను ఆదుకోవాలని ఆందోల్ డివిజన్ సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ పాండు, తహసీల్దారు భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డివిజన్ పరిధిలోని అందోలు, పుల్కల్ ప్రాంతాల్లో ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. దీంతో తడిసిన ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ధాన్యంను తూకం వేసిన తర్వాత కూడా లారీలు రాకపోవడంతో నెలల తరబడి ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రం వద్దనే ఉంచాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ధాన్యంను తరలించే లారీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అధిక తేమ, తాలూ పేరిట తరుగు తీస్తున్న రైస్‌మిల్లర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేశం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్పస్వామి కల్యాణం



ఆలయ నిర్వాహకులతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీకృష్ణనగర్ కాలనీ బీరప్ప మందిరంలో మల్లన్న, బీరప్ప, కామరతి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్తగొల్ల అనురాధ, కొత్తగొల్ల కృష్ణ, పెద్దగొల్ల అంజనేయులు, సుధీర్‌రెడ్డి, శ్రీహరి, కొత్తగొల్ల సోమశేఖర్ పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

బీరప్పస్వామికి ఎమ్మెల్యే పూజలు



బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సికింద్రాపూర్ బీరప్ప కల్యాణోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నోటీసు అందజేత

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిని నిర్మిస్తున్న వ్యక్తికి అధికారులు సోమవారం నోటీసులు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామానికి చెందిన యాదయ్య యాదవ్ తన వ్యవసాయ పొలం వద్ద ఇంటిని నిర్మించడంతో పాటు పొలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నాడు. ఇప్పటికే రెండు నోటీసులు అందించినా ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్న సమయంలో అధికారులు నోటీసులు అందించి పనులు నిలిపివేశారు. మూడో నోటీసు ఇచ్చినా ఎలాంటి సంజాయిషీ రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఆనందం సదరు వ్యక్తికి నోటీసు అందజేశారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇంటి యజమానికి నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆనందం

క్రీడారంగానికి సహకారమిస్తాం



విజేత జట్టుకు బహుమతులను ప్రదానం చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: క్రీడారంగానికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన పాటి క్రికెట్ ట్రోఫీ ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు పట్టణంలో రూ.7, 50కోట్లతో మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతో పాటు పాటి గ్రామ పరిధిలో 5 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మినీ స్టేడియాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విజేత జట్టుకు, రన్నరప్ జట్లకు సొంతంగా లక్ష రూపాయలను బహుమతి రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, స్వామిగౌడ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, డీజీఎం శివకుమార్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీ, చైతన్యనగర్ కాలనీ, బండ్లగూడలోని మార్క్సనగర్ కాలనీలో సోమవారం పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు కాలనీలలో పర్యటించి డ్రైనేజీల పూడికతీత పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతుల కారణంగా నేడు మండల పరిధిలోని హద్నూర్, న్యాల్‌కల్, చాల్కి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది రఘునాథ్ సోమవరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంగిన విద్యుత్ స్తంభాలు, తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు 5 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలి

నర్సాపూర్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో భాగంగా పంచాయితీ కార్యదర్శులు చేపట్టే పనులకు సొంత డబ్బు ఖర్చు విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ మధులతను కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు, పలువురు కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారుల పాలన వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో చేపడుతున్న పనులకు ప్రభుత్వం నుంచి నిధులు రానందున తాము తమకు వచ్చే వేతనాల నుంచి ఖర్చు చేయాల్సి వస్తుందని వివరించారు. కాగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పలువురు కార్మికులకు సుమారు ఆరు నెలలుగా జీతాలు రానందున జూన్ ఒకటి నుంచి వారు విధులకు రామని చెప్పారని, వారి జీతాలు వచ్చేలా చూడా లని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు మల్లేశం, తారాసింగ్, లక్ష్మణ్, రవి, లలిత, సంగీత, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

రేణుకా ఎల్లమ్మ తల్లికి అభిషేకం, పూజలు

మునిపల్లి(అందోల్): మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 21న బోనాల కార్యక్రమం ఉంటుందని సీపీఎం మండల నాయకులు రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. అనంతరం రేణుకాఎల్లమ్మ జాతర నిర్వహణకు కాంగ్రెస్ నాయకులు రాజగోని నరేందర్‌గౌడ్ రూ.51వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

బోరంచ జాతరకు బస్సు సౌకర్యం కల్పించాలి

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని బోరంచ నల్లపోచమ్మ జాతరకు ఆర్టీసీ అధికారులు నారాయణఖేడ్- బోరంచల మధ్య ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర తర్వాత అంతటి పెద్ద జాతర బోరంచలో జరుగుతుంది. ఏడు వారాల పాటు ప్రతి గురువారం జాతర కొనసాగుతుండగా గత గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. ఆరునెలల కిందట రోడ్డును నిర్మించినా బస్సు సదుపాయం కల్పించకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

మునిపల్లి(అందోల్): పెద్దచల్మెడ వ్యవసాయ సహాకార పరపతి సంఘంలో రైతులకు జనుములు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.3,620 క్వింటాల్ జనుముల ధర ఉందన్నారు. బస్తాలో 40 కిలోల జనుము విత్తనాలతో ప్యాక్ చేయబడిందన్నారు. జనుములు అవసరమున్న రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాఫీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు, కుప్పలు

రైతుల ఆవేదన

నర్సాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నింపిన వడ్ల బస్తాలను రైసుమిల్లులకు రవాణా చేయట్లేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు సంచుల్లో నింపి కాంటా పెట్టినా.. వాహనాలు లేక కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. మూడు రోజులుగా అకాల వర్షాలు పడుతున్నందున వడ్ల బస్తాలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ చివర ఉన్న బస్తాలు తడిసి వాటిలోని వడ్లు తడిశాయని రైతులు చెప్పారు. వడ్లు బస్తాల్లో నింపినా.. మిల్లులకు తరలించకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యమని, వాహనాలు రాకపోతే తాము ఎందుకు బాధ్యత వహించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. తడిసిన బస్తాల విషయమై ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌ను వివరణ కోరగా.. వర్షాలకు తడిసిన బస్తాల్లోని వడ్లను వేరే బస్తాల్లోకి మార్చే పనులు సెంటర్ల ఆధ్వర్యంలో చేపడుతున్నామని ఆయన చెప్పారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొండాపూర్ (సంగారెడ్డి): సంగారెడ్డి పట్టణంలోని కెమిస్ట్ భవన్‌లో సోమవారం శాలివాహన హైస్కూల్ 2001–2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి అప్పటి ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం పాఠాలను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, మాధవరెడ్డి, లక్ష్మీప్రియ, వెంకట్ రాంరెడ్డి, దిలీప్, సుధీర్, నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు